# వాకపల్లి మహిళల న్యాయ పోరాటానికి పదేళ్లు

న్యాయస్థానం తలుపులు తట్టే అవకాశం ఎవరికయినా, ఎప్పుడయినా ఉంటుందన్న మాట నిజమే. కానీ ఆ హక్కు గ్రేహౌండ్స్ పోలీసులచేత అత్యాచారానికి గురయిన ఆదివాసీ మహిళలకు న్యాయం చేకూర్చే ప్రయత్నాలకు తీవ్ర ప్రతిబంధకంగా మారడమే ఒక బాధాకర సందర్భం.

ఈ ప్రస్తావన ఎక్కడో జరుగుతున్న న్యాయ పోరాటం గురించి కాదు. మన జిల్లాలోనే సరిగ్గా పదేళ్ళ క్రితం జి.మాడుగుల మండలంలోని వాకపల్లి గ్రామంలో 11 మంది ఆదివాసీ మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసులు పాల్పడ్డ అత్యాచారానికి వ్యతిరేకంగా జరుగుతున్న సుదీర్ఘ న్యాయ పోరాటం గురించి. మరీ ముఖ్యంగా ఆ పోరాటం నిందితులకు శిక్ష వేయడం గురించి కాక, అసలు వారిపై కేసు కొనసాగించాలా లేదా అన్న విషయంపై సుప్రీం కోర్టులో ఆ మహిళలు తలపడవలసిన పరిస్థితి గురించి.




## ఏం జరిగింది?

జి. మాడుగుల మండలంలోని నుర్మతి పంచాయతీకి చెందిన వాకపల్లి గ్రామంలో 2007 ఆగస్ట్ 20వ తేదీ ఉదయం 11 మంది కోందు ఆదివాసీ స్త్రీలపై గ్రేహౌండ్స్ పోలీసులు అత్యాచారానికి పాల్పడ్డారు. గ్రామంపై పడి విధ్వంసం సృష్టించారు.

వాకపల్లి మహిళలు పాడేరు పోలీసుల వద్దకు పోతే వారు కేసు నమోదు చేసినట్టే చేసి దర్యాప్తు విషయానికి వచ్చేసరికి అన్యాయంగా వ్యవహరించారు. ఈ మొత్తం వ్యవహారంపైన మహిళా, ఆదివాసీ, హక్కుల సంఘాల నుంచి రాష్ట్ర వ్యాపితంగా నిరసన పెల్లుబికింది. అత్యాచారం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండు చేశాయి. నిందితులు పోలీసులే కనుక విచారణను స్థానిక పోలీసు లేదా సిబిసిఐడిల చేతుల్లో పెట్టకుండా సిబిఐకి అప్పగించాలని అన్ని సంఘాలు మొదట్నుంచీ డిమాండు చేశాయి. అదే సమయంలో గిరిజన సంక్షేమ కమిషనర్ వాకపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తుల వాంగ్మూలాన్ని తీసుకున్నారు. నిందితులయిన 21 మంది గ్రేహౌండ్స్ పోలీసులనూ విచారించారు. ఆ తర్వాత ఆయన ఇచ్చిన నివేదికలో స్థానిక పోలీసులు అసలేం విచారణను చేపట్టడం లేదని చెబుతూ నేర విచారణను ఒక స్వతంత్ర పరిశోధనా సంస్థ చేత జరిపించాలని సిఫార్సు చేశారు.

అయితే ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య హైకోర్టుకు వెళ్ళడంతో కేసు దర్యాప్తును సిబిసిఐడితో చేయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సదరు కోర్టు ఆదేశించింది. ఫలితంగా ప్రభుత్వం కేసును సిఐడి ఎస్పీకి అప్పగించింది. సిఐడి పోలీసులు సంఘటన జరిగిన 40 రోజులకు మహిళల వాంగ్మూలాల్ని తీసుకున్నారు. 56 రోజుల తర్వాత నేరం జరిగిన ప్రదేశాన్ని సందర్శించి పంచనామా చేసారు! ఇంతజేసీ అత్యాచారం జరిగిన ఛాయలు మీ శరీరాలపై లేవు కనుక అత్యాచారం నమ్మశక్యంగా లేదనే నిర్ధారణకు వారు వచ్చేసారు.

అనుకున్నట్టే సిఐడి ఎస్పీ మహిళల ఫిర్యాదు అబద్ధమని నిర్ధారించేసారు.

అత్యాచారానికి గురయిన మహిళలు సిబిసిఐడి ఎస్పీ నివేదికను తప్పులతడకగా విమర్శిస్తూ పాడేరు మేజిస్ట్రేట్ కోర్టులో 16 ఏప్రిల్ 2008న ప్రొటెస్టు పిటిషన్ దాఖలు చేశారు. ఎస్పీ ఇచ్చిన రిపోర్టును తిరస్కరించాలనీ, తమ ఫిర్యాదును ప్రైవేటు కంప్లైంట్‌గా స్వీకరించాలనీ ఫిర్యాది దారులు కోరారు. పాడేరు కోర్టు ఈ ఫిర్యాదును స్వీకరించింది. ఈ కేసును కొట్టివేయాలని ఆ 21 మంది నిందితులు హైకోర్టులో పిటిషన్ వేసి వారం తిరక్కుండానే తాత్కాలిక స్టే ఉత్తర్వులు తెచ్చుకున్నారు. వాదోపవాదాలు విన్న తరువాత ఈ 21 మందిలో 13 మందిపై పాడేరు మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ కొనసాగించాలని 2012 ఏప్రిల్ లో హైకోర్టు తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా 13 మంది నిందితులూ సుప్రీం కోర్టుకు పోయి తాత్కాలిక స్టే ఉత్తర్వులు తెచ్చుకున్నారు. భారత అత్యున్నత న్యాయ స్థానం ఈ కేసులో తుది తీర్పును ఇంకా వెల్లడించాల్సి వుంది. ఇంతకీ కోర్టు తేల్చాల్సింది ఆ 13 మందీ శిక్షార్హులు అవునా కాదా అన్నది కాదు. వారి పైన కేసు కొనసాగించాలా లేదా అన్న విషయాన్ని తేల్చడం మాత్రమే! ఈ విషయం తేల్చడానికి న్యాయ స్థానాలకు పదేళ్ళు చాలలేదు.

నిందితులు 2012 లో సుప్రీం కోర్టును ఆశ్రయించిన కొన్నాళ్ళకు దేశ రాజధానిలో నిర్భయ సంఘటన జరిగింది. ఈ ఘటనకు వెల్లువెత్తిన నిరసనల నేపథ్యంలో ఆనాటి ప్రభుత్వం వర్మ కమిషన్‌ను నియమించింది. కమిషన్ చేసిన సిఫార్సులను అన్నింటినీ పరిగణనలోకి తీసుకోకపోయినా ‘రేప్ లా’ను ప్రభుత్వం మరింత కట్టుదిట్టం చేసింది. నిర్భయ గాయం సలుపుతుండగా, ‘రేప్ లా’ లో మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో వాకపల్లి మహిళలు సుప్రీం కోర్టులో 2013 ఫిబ్రవరిలో నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటరు పిటిషన్ దాఖలు చేశారు. నిర్భయ కేసులో మాదిరిగానే తమ కేసులో కూడా సత్వర న్యాయం చేకూరుతుందన్న వారి ఆశ అడియాశే అయ్యింది. వారి న్యాయ పోరాటం నేటికీ ఒక కొలిక్కి రాలేదు.

ఈ వైకుంఠపాళిలో వాకపల్లి మహిళలు ఒక్కొక్క మెట్టూ ఎగబ్రాకుతూనే వున్నారు. ఈ పదేళ్ళ కాలంలో వారిలో ఇద్దరు మరణించారు కూడా. ఈ తరహా కేసులలో ఒత్తిళ్ళకో, భయానికో, ప్రలోభాలకో గురయి ఫిర్యాదిదారులు మధ్యలోనే కేసు నుంచి వైదొలగిన సందర్భాలు తక్కువేమీ కాదు. కానీ వాకపల్లి మహిళలు దీనికి భిన్నంగా అన్నిరకాల ఒత్తిళ్ళనూ, బెదిరింపులనూ తట్టుకుని నిలబడ్డారు. మొదట నుంచీ వారిది ఒకటే మాట... “మాపై అత్యాచారం చేసిన పోలీసులకు శిక్ష పడాలి”.

రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం ప్రభుత్వాలు అధికారం పొందేది ప్రజల నుండి. తమకు అధికారం కట్టబెట్టిన ప్రజలపై తమ రక్షక భటులు లైంగిక దాడులకు పాల్పడుతుంటే ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహించి ఊరుకోవడం మాట అటుంచండి వత్తాసు పలుకుతున్నాయి. జవాబుదారీ కాదు పొమ్మంటున్నాయి. అది జరగనివ్వమని వాకపల్లి మహిళలు గత పదేళ్లుగా మొండిగా గుర్తు చేస్తూనే ఉన్నారు. గ్రేహౌండ్స్ అయినా, మరొకరయినా చట్టం ముందు అందరూ సమానమే అని నిలదీస్తున్నారు.

వారి పోరాటాన్ని మరొక్క సారి సమాజానికి గుర్తు చేయడానికీ, ఆ పోరాటానికి మద్దత్తును కూడగట్టడానికీ మానవహక్కుల వేదిక (HRF) తన 6వ జిల్లా మహాసభల సందర్భంగా సదస్సు నిర్వహిస్తున్నది. అందరికీ ఆహ్వానం పలుకుతున్నాం.

తేదీ : ఆగస్ట్ 20 , ఆదివారం, ఉదయం 10 గం.

వేదిక : బిల్డర్స్ అసోసియేషన్ హాల్, సిరిపురం

వక్తలు : **వసుధ నాగరాజ్**
న్యాయవాది, హైదరాబాద్
**రామారావు దొర**
ఆదివాసీ రచయితల సంఘం
**కె. పద్మ**
మహిళా చేతన
**ఎస్. జీవన్ కుమార్**
మానవహక్కుల వేదిక

10 ఆగస్ట్ 2017

**మానవహక్కుల వేదిక**
Human Rights Forum (HRF)
విశాఖపట్నం జిల్లా